ఊరబడి

19

తవ్వా ఓబుల్‌రెడ్డి

కాలికి తాడుకట్టి దూరంగా ఈడ్చివేసిన కుష్టురోగిలా ఉంది, ఆ వూరి బడి. మసకబారిపోయిన బడిగోడలు మాత్రం వెన్నెల్లో తెల్లగా కనిపిస్తున్నాయి. బడికి ఫర్లాంగు దూరంలో ఊరు. ఊళ్ళో అక్కడక్కడా విద్యుద్దీపాలు మినుకు మినుకుమంటూ ఉన్నాయి.

నోట్లో ముద్ద పడగానే గూట్లోని దియ్యను మలిపి కునుకు తీసే రోజులు ఎప్పుడో పోయాయి కదా! సీరియళ్లు చూస్తూ టీవీలకు అతుక్కుపోయి నట్లున్నారు, ఊరిజనమంతా. ఎవరికో పీడ తీస్తుంటే ఊళ్ళోని వాళ్ళంతా ఇళ్ళల్లోకి వెళ్ళి వాకిల్లేసుకున్నట్లుగా వీధులన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. వీధి వెంట చిన్నగా అడుగులు వేస్తూ ఏవో కూనిరాగాలు పాడుతూ బడివైపు వస్తోంది, ఓ ఆకారం. ఆ ఆకారం బడిని సమీపించేకొద్దీ ఊతకర్ర శబ్దం వినిపిస్తోంది. చేతిలో అన్నం గిన్నె. చంకకు చిన్న జోలె.... ఎవరో బైరాగి! ఊళ్ళో తిరిగి అన్నం తెచ్చుకున్నట్లున్నాడు. బడి ఆవరణలోని

మంచినీటి బోరింగు దగ్గరికి వెళ్ళి కాళ్ళూ చేతులు కడుక్కున్నాడు. అన్నం తిని మళ్ళీ బోరింగు వద్దకెళ్ళి నీళ్ళు తాగి, గిన్నెను జోలెలో వేసుకున్నాడు. అగ్గిపుల్ల గీసి బీడీ వెలిగించుకున్న తర్వాత చిన్నగా కూనిరాగంలా ప్రారంభించి తత్వగీతం అందుకున్నాడు.

"... గాలీ కంపనూ తెచ్చీ... గూడెళ్ళ నే కట్టీ...

గూటిలోనా రెండు గుడ్లు పెట్టీ...

గుడ్లూ పగిలీ పిల్లలు ఎగిసీపోవుటె గానీ...

గూటితో ఒక మాట సెప్పీ పోయేనా...!

... ఇలా సాగుతోంది, తత్వాలాపన. అగరు పొగలా బడి పరిసరాలను అలుముకుంటోంది, బైరాగి పాడుతున్న తత్వగీతం. ఇంతలో...

ఫక్కున నవ్వు...! పకపక నవ్వు...!!

బైరాగి తత్వగీతాలాపనను ఆపాడు.

మళ్ళీ అదే నవ్వు!

సమీపంలో ఎవరో స్త్రీ నవ్వినట్లుగా అనిపించింది, బైరాగికి. చీకట్లోనే అటూ ఇటూ పారజూశాడు. ఎవరూ కనిపించలేదు. బడి గది లోపల్నుండి ఎవరైనా నవ్వుతున్నారేమోనని అనుమానం వచ్చింది బైరాగికి. తాళం వేసి వున్న తలుపుల సందుల వద్ద చెవి పెట్టి, లోపలినుంచేమైనా శబ్దం వస్తోందేమోనని పరీక్షించాడు, బైరాగి.

మళ్ళీ అదే నవ్వు...! పకపక నవ్వు...!!

"లోపల ఎవరూ...?" బైరాగి ప్రశ్నించాడు.

నవ్వు ఆగలేదు...!

"ఎవరమ్మా? నిన్నే లోపల ఎవరుండారు?" స్వరం పెంచి ప్రశ్నించాడు, బైరాగి.

కొంతసేపు నవ్వు ఆగిపోయింది.

తెల్లని మల్లెపువ్వులాంటి దుస్తుల్లో దేవత లాంటి ఆకారం బైరాగి ముందు ప్రత్యక్షమైంది.

బైరాగి అప్రయత్నంగానే రెండు చేతులెత్తి నమస్కరించాడు.

"తత్వం బాగా పాడినావు పెద్దాయనా! మన ఇరువురి పరిస్థితికీ ఈ తత్వగీతం సరిపోయేలాగే ఉంది" అంది దేవతలాంటి ఆకారం.

"గుడ్లూ పగిలీ పిల్లలు ఎగిసీ పోవుటే గానీ...

గూటితో ఒక మాట సెప్పీ పోయేనా..!"

అంటూ బైరాగి పాడిన తత్వాన్ని తన కమ్మని కంఠంతో ఉచ్చరించింది... దేవత లాంటి ఆకారం.

"ఎవరు తల్లీ నువ్వు?" మళ్ళీ నమస్కరిస్తూ అడిగాడు, బైరాగి.

"నేనా?.... ఈ బడితల్లిని పెద్దాయనా!" అసలు తానెవరో చెప్పింది... బడితల్లి!

"బైరాగుల పరిస్థితి అందరికీ తెలిసిందే కదా...! చదువుల తల్లివి! నీకేమయింది తల్లీ?" ఆసక్తిగా ప్రశ్నించాడు, బైరాగి.

"చెబుతాను... సావధానంగా విను...!" అంటూ చెప్పడం ప్రారంభించింది, బడితల్లి.

"ఏ యాభై ఏళ్ళ కిందటో ఈ ఊళ్ళో పుట్టాను నేను. నిన్న, మొన్నటి వరకూ ఊళ్ళోవాళ్ళు నన్ను పవిత్రంగా, గౌరవంగా చూసుకునేవారు. నిండుగా పిల్లలతో కళకళలాడుతూ ఉండేదాన్ని! నా బడిలో చదువులు నేర్చుకున్న ఎందరో పిల్లలు మంచి మంచి హోదా కలిగిన ఉద్యోగాలను పొందారు.

జెండాల పండగొచ్చినా... మరే పండగొచ్చినా నన్ను రంగు కాగితాలతో అలంకరించి చక్కగా తీర్చిదిద్దేవారు. జెండాల పండుగ రోజు ఊరి జనమంతా నా వద్దకు చేరి జెండా వేడుకను తిలకించేవారు. అయ్యవార్లనూ గౌరవించేవారు. దగ్గరున్న టౌన్లో ఆ ఇంగ్లీషు బడులు పెట్టిన తర్వాత నా దగ్గరికి వచ్చే పిల్లలు నాకు దూరం కాసాగారు.

ఆ కాన్వెంటు బళ్ళను కాన్సెప్టు స్కూళ్ళనీ, పబ్లిక్ స్కూళ్ళనీ, రెసిడెన్షియల్ స్కూళ్ళనీ... మరేవో కొత్త కొత్త పేర్లతో పిలుస్తున్నారులే! పల్లెల్లోని ఈ పేర్లు తెలియనివారు మాత్రం బస్సుబడి, ఆటోబడి, వ్యానుబడి, హాస్టల్‌బడి అంటూ ఒక్కో ఇంగ్లీషుబడికి ఒక్కో పేరుతో పిలుస్తున్నారు.

నా పిల్లలతో ఆ ఇంగ్లీషు బడిపిల్లలు కొట్లాడినప్పుడు మా బడిని 'డొక్కుబడి', 'తుక్కుబడి' అని కూడా తిడతారని నా పిల్లలు మా అయ్యవార్లతో చెబుతూంటే విన్నాను. పాపం పసివాళ్ళు...! ఆ కాన్వెంటు పిల్లలకైనా ఏం తెలుసు? అక్కడ డబ్బులు కట్టలేనప్పుడు, దెబ్బలు తిన్నప్పుడు ఆ బడికి పోమంటూ తిరిగి నా బడిలో వాలే పిల్లలు కూడా ఉన్నారు.

ఇంగ్లీషుబడి మోజు ముదరకముందు మా బడికి వందమంది దాకా పిల్లలు వచ్చేవారు. ఇప్పుడు ఇరవైమంది రావడమే గగనకుసుమం అయింది. తక్కువమంది పిల్లలతో బోసిపోయినట్లుగా ఉంది నా పరిస్థితి. శెలవు రోజులు వస్తే నా పరిస్థితి విచారకరంగా ఉంటుంది. పక్షులు ఎగిరిపోయిన గూడులా ఉండిపోతాను. శెలవు రోజుల్లో నీలాంటి బైరాగులూ, భిక్షగాళ్ళూ, వలసకూలీలు నన్ను ఆశ్రయిస్తూ ఉంటారు.

కల్లాకపటం తెలియని పిల్లలంటే నాకు ఎంత ఇష్టమో... నా పిల్లలకు కూడా నేను అంతే ఇష్టం. ఐదవ తరగతి పిల్లలు పొద్దున్నే వచ్చి తలుపులు తీసి శుభ్రం చేస్తారు. చిత్రపటాలను పూలతో అలంకరిస్తారు. ప్రార్థన సమయంలో మంచి మంచి శ్లోకాలనూ, గేయాలనూ ఆలపిస్తారు. కొత్తగా బడికి వచ్చే పిల్లలు, బడినీ, పరిసరాలనూ కళ్ళు పెద్దవి చేసి వింత వింతగా చూస్తూ ఉంటారు.

బడికి వచ్చే పిల్లల్లో ఆడపిల్లలే ఎక్కువ. ఇరవైమందిలో ఇద్దరే ఇద్దరు మగపిల్లలు! ఊళ్ళోని వారు మగపిల్లలను ఇంగ్లీషు బడులకు పంపడం వల్ల.. పాపం! ఆడపిల్లలు మాత్రం ఈ బడికి వస్తూ ఉంటారు. ఈ కొద్దిమంది పిల్లల్లో కూడా మతిస్థిమితం లేని పిల్లలూ, అంగవైకల్యంతో బాధపడే పిల్లలూ ఐదారుమంది ఉంటారు. అయినా ఆటలతో, పాటలతో ఆ పిల్లలంతా ఆనందంగా ఇక్కడ చదువుకుంటున్నారు. ఇంగ్లీషు చదువుల పేరుతో టౌనుకు వెళ్తున్న చాలామంది పిల్లల పరిస్థితి నరకప్రాయంగా మారినట్లు కూడా తెలుసుకుంటున్నాను. గాలి, వెలుతురు లేని చీకటి గదులతో, బలవంతపు బట్టీ చదువులతో కుంగిపోతున్న పిల్లలు కొందరు అప్పుడప్పుడూ ఈ బడికి వచ్చి తమ బాధలు వెళ్ళబోసుకుంటూ ఉంటారు కూడా! ఆటపాటల కోసం మొహం వాచిన ఆ పసిపిల్లలను చూస్తే కడుపు తరుక్కుపోతుంది. తెలుగులో మాట్లాడిన పాపానికి నేరస్తుల్లా శిక్షలు అనుభవిస్తున్న పిల్లల మానసిక వేదనను అర్థం చేసుకునేవారే కరువయ్యారు.

ఇక బడిలో పిల్లల ప్రవర్తన, వారి కార్యకలాపాలూ చూసి నాలో నేను ఆశ్చర్యపోతూ ఉంటాను. విరామ సమయంలో పిల్లలను గమనించడం నాకో పెద్ద ముచ్చట! విరామ సమయపు గంట మోగగానే పంటచేలపై రివ్వున దూసుకువెళ్ళే గువ్వల గుంపు మాదిరిగా పిల్లలు తరగతుల నుండి బయటపడి వీధుల్లోకి పరుగులు తీస్తారు.

కొందరు పిల్లలు ఇళ్ళకు వెళ్ళి బియ్యమో, పప్పులో, బెల్లమో తెచ్చుకుని తింటూ ఉంటారు. కొందరు గబగబ అన్నం తినేసి వస్తారు. ఇళ్ళల్లోని గాదెలూ, సంచులూ శోధించి గింజలు పట్టుకువెళ్ళి అంగట్లో తినుబండారాలు తెచ్చుకుంటారు కొందరు.

ఆ కొంచెం విరామ సమయంలోనే పిల్లలు ప్రదర్శించే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. కొందరు ఇసుకలో ఇళ్ళు కడతారు. ఇంకొందరు ఆటలు ఆడుతూ ఉంటే మరికొందరు పాటలు పాడుతూ ఉంటారు.

కొందరు పిల్లలు పలకలపై కర్రలతో మోదుతూ 'దప్పు'లా మ్రోగిస్తూ ఉంటారు. ఒకరిద్దరు పిల్లలు ఇవేమీ పట్టనట్టుగా తరగతి గదికి పరిమితమై పుస్తకాలతో కుస్తీపడుతూ ఉంటారు. విరామ సమయం ముగియగానే గంట మోగుతుంది. తుట్టెను చేరు కుంటున్న తేనెటీగల్లా పిల్లలు బిలబిలా తరగతి గదిలోకి చేరిపోతారు. క్షణాల్లో బడిని నిశ్శబ్దం ఆవహిస్తుంది. కాస్త వెసులుబాటు దొరికితే చాలు పిల్లలు అయ్యవార్లకు ఎన్నెన్నో విషయాలను చెప్పడం మొదలుపెడతారు.

ఊళ్ళో జరిగే చావు పుట్టుకలూ, పెళ్ళి పేరంటాలు, పోట్లాటలూ, ఘర్షణలూ ఏవైనా సరే... పిల్లలు బడికి మోసుకువచ్చి అయ్యవార్లకు చెబుతూ ఉంటారు. చేల గురించి, చెట్ల గురించీ, పుట్టల గురించీ ఉత్సాహంగా వివరిస్తూ ఉంటారు. తమ ఇళ్ళలో గేదెలూ, కుక్కలూ, మేకలూ ఈనితే పిల్లలకు అదో ముఖ్యాంశపు వార్త! దూడల గురించీ, కుక్క మేకల పిల్లల గురించీ వారి వర్ణన ఆసక్తికరంగా ఉంటుంది. ఊళ్ళో జరిగే ఉత్సవాలు, జాతరల గురించి పిల్లల బోగట్టా సుదీర్ఘంగానే ఉంటుంది. కొత్త బట్టలూ, పిండివంటలూ సరేసరి! ఊళ్ళోకి గుర్రాలు వచ్చినా, ఎలుగుబంటి వాళ్ళు వచ్చినా ఆ సమాచారం చెప్పే ఆతృతలో పిల్లలకు గుక్క తిరగడం కష్టమౌతుంది" అంటూ చెప్పడం కొంతసేపు ఆపింది బడితల్లి.

బైరాగి ఆసక్తిగా వింటూ ఉన్నాడు.

మళ్ళీ చెప్పడం ప్రారంభించింది, బడితల్లి.

"ఉన్న పిల్లలతో ఎలాగో కాలం గడుస్తుం దనుకుంటే... ఆ తృప్తి కూడా మిగిలేట్లు లేదు. ఇరవైమందికి తక్కువైతే ఆ బడికి ఒక అయ్యవారునే ఉంచుతారని, పది మంది పిల్లలకు తగ్గితే అసలు బడినే మూసివేస్తారని ఈ మధ్య అయ్యవార్లు చెప్పుకుంటుంటే విన్నాను. బడిని మూసివేస్తే నేను అనాథలా మారిపోతానేమో? ఊర్లోని బడికి శెలవులు ఎక్కువనీ, బడి సమయంలో కూడా పిల్లలు ఇళ్ళకు వచ్చి సతాయిస్తూ వుంటారనీ, ఊళ్ళో ఉంటే పిల్లలు చెట్టుపుట్టల వెంట తిరగడం, బావుల్లో ఈతాడటం, కుంటల్లో చేపలు పట్టడం చేస్తూ ఉంటారని అందుకే టౌనులోని ఇంగ్లీషు బడికి పంపుతున్నామని కొందరు తల్లిదండ్రులు చెబుతూ ఉంటారు. ఇంగ్లీషు చదువులే చదివితే చాలు! జీవితానుభవం, పరిసరాల విజ్ఞానం అక్కరలేదనేది వారి భావనలా ఉంది.

గోరుచుట్టుపై రోకటిపోటులా ఈమధ్య అయ్యవార్లూ బందు చేశారు. ఇరవై రోజులు బడి మూతపడింది. సందట్లో సడేమియా అన్నట్టుగా నలుగురైదుగురు పిల్లల్ని ఇంగ్లీషు బడివాళ్ళు తన్నుకుపోయారు."

బడితల్లి తన కథను వివరిస్తూ కళ్ళనుండీ ఉబికివచ్చిన కన్నీటిని తుడుచుకోసాగింది. బడితల్లి ఆవేదనకు బైరాగి చలించిపోయాడు.

ఇంతలో బోరింగు దగ్గర ఏదో అలికిడి అయింది. ఊరివాళ్ళు ఎవరో నీళ్ళకోసం వచ్చి నట్టున్నారు. ఇది గమనించిన బడితల్లి చటుక్కున అదృశ్యమైంది.

బైరాగి మళ్ళీ తత్వగేయం అందుకున్నాడు.

"గుడ్లూ పగిలీ పిల్లలు ఎగిసీపోవుటే గానీ...

గూటితో ఒక మాట సెప్పీపోయేనా?!"

అంటూ, తన వెంట తెచ్చుకున్న పట్టను బడి వసారాలో పరుచుకుని, పడుకున్నాడు బైరాగి.

కాలికి తాడుకట్టి ఊరికి దూరంగా ఈడ్చి పడేసిన కుష్టురోగిలా ఉంది... ఆ బడి!

"9491336488"

కోసూరి రవికుమార్

ఏదీ కదిలించలేదు
మరణం తప్ప
మరొకటి ఏదీ
మధ్యలోకి రాలేదు.
మెదడున్నదా
అయితే నువ్వు ఇల్లలకుతున్న ఈగవే.

గాలి పీల్చాలా.... వద్దా
ముందుకు వెళ్ళాలా, వెనక్కు వెళ్ళాలా
బతకాలా? చావాలా?
వేలి చివరల్లో మెత్తలమీది అక్షరాలను ఆశ్రయించు
సందేశాలగుట్టు చెబ్తుంది సమాధానం
అన్నీ అంగీకరిస్తూ పోయాక
గొప్ప విధ్వంసాల గుట్టలు పడ్డ
కంటితెరలమీద
గ్రానైటు గని కూలినా
ఏమీ జరగదు
లోపలెక్కడా చిన్న నరమూ కదలదు
కొంచెమైనా తడి లేకుండా జాగ్రత్తపడతాడతడు
నువ్వసలు లేనే లేకుండా చెప్పేక్రమంలో
అతనే నువ్వై మిగుల్తాడు
ఏం ఆలోచన దొరా
అంటూ అతని పాదాల దగ్గర కూర్చొని వున్నంతకాలం
నువ్వుండవు... నీకో పేరూ వుండదు
అన్నీ అతడిచ్చిన సంఖ్యలే
ఊహలూ... ఊసులూ
అన్నీ చెవినుంచి పెదవి మధ్యన
దొర్లి దొర్లి
కనబడకుండా జేబుల్లో దూరి
కష్టాన్ని కరిగించి చేసిన రూపాయి బిళ్ళను
అమాంతం మింగేస్తున్నా
ఏదీ.... ఏదీ.... నిన్ను కదిలించదు
నీ చేతిలోనో, జేబులోనో
నదుంకున్న తొలుపటకాలోనో చేరి
నిన్నాడిస్తున్న అతడి ఆలోచన తప్ప
ఏదీ నిన్ను కదిలించదు.
పొద్దున్నే పేపరు చదవొద్దంటున్నాడిపుడు
రేపుగాలి పీల్చొద్దంటాడు
పిడికెడు మెతుకులూ తినొద్దంటాడు
గుక్కెడు నీళ్ళూ తాగొద్దంటాడు
అన్నీ నేచెబ్తాకదా
నా ఆలోచన నీ చేతుల్లో వుందికదా
ఏం ఆలోచన దొరా అని
మోకాళ్ళ మీద కూలబడు
నా పాదాలమీద మీ బతుకుల్ని కుమ్మరించు
మీ తర్వాతి తరానికీ,
ఓ నెంబరిస్తాను
ఏమేమి ఎపుడెపుడు చేయాలో
అన్నీ బోధపరచబడే మెనూలోకి
కూరుకుని పో.... అంటాడు
నువ్వు లేని లోకంలో
అందరూ అతనులే...

+ + +

ఓహో భలే ఆలోచన దొరా లని
బతికుందాలో.... అక్కర్లేదో...
ఎస్.ఎం.ఎస్. అడుగూ...
నీ నంబరు ఇదే....